క్లుప్తంగా

రేసపువానిపాలెం యూపీహెచ్‌సీ సందర్శన



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అనంతరం అదే ఏరియాలోని హరిజన వీధి సచివాలయాన్ని సందర్శించి లబ్ధిదారులు, సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై డీఎంహెచ్‌వో సమీక్ష చేశారు. అర్హులందరికీ అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ వేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల భరతం పట్టాలి

మద్దిలపాలెం: రోజుకో రకంగా జనాన్ని దోచేస్తున్న సైబర్ నేరగాళ్ల భరతం పట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఓబీసీ డిపార్ట్‌మెంట్ మాజీ చైర్మన్ మూల వెంకటరావు ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లోనే రూ.1,750 కోట్లను సైబర్ నేరగాళ్లు దోచేశారని, జాతీయ సైబర్ నేరాల పోర్టల్‌లో రోజుకు 7,000 చొప్పున కేసులు నమోదవుతున్నాయని వివరించారు. ఇలా వ్యవస్థీకృత దందాగా మారిన సైబర్ నేరాలకు ఉన్నత విద్యావంతులు, వ్యాపారులు బలవుతున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ నేరాలపై సినిమా థియేటర్లు, టీవీలు, ఓటీటీలు, విద్య సంస్థలు, ఉద్యోగ ప్రదేశాల్లో విరివిగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించడం అన్నింటికన్నా ప్రధానమన్నారు. ఈ విషయంపై ప్రధాన, ముఖ్యమంత్రులు దృష్టి పెట్టాలని మూల వెంకటరావు సూచించారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



విరాళం చెక్కు అందిస్తున్న దాతలు ప్రకాశరావు, లలిత దంపతులు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం విశాలాక్షినగర్‌కి చెందిన ఏఎస్ ప్రకాశరావు, లలిత దంపతులు బుధవారం రూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత చెక్కుని ఆలయంలో సూపరింటెండెంట్ త్రిమూర్తులకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలి



మాట్లాడుతున్న ఇస్కఫ్ కన్వీనర్ దేవరకొండ మార్కండేయులు

సీతంపేట: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటుపరం చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని ఇస్కఫ్ కన్వీనర్ దేవరకొండ మార్కండేయులు ఆరోపించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఇస్కఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించి, సొంత గనులు, క్యాపిటల్ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు శ్యాంసుందర్, అప్పలరాజు, టి.ఎస్.సుకుమారన్, ఇమంది పైడిరాజు, సత్యనారాయణ, సూర్యకుమారి, మధుమతి, లక్ష్మీపతి, కృష్ణబాబు పాల్గొన్నారు.

పాడైపోయిన పరికరాలు..
ఆటలకు పాట్లు



గోకుల్ పార్క్‌లో పాడైపోయిన ఆట పరికరాలు

- సాగరతీరం పార్కుల్లో ఇదీ పరిస్థితి
- నిరాశకు గురవుతున్న చిన్నారులు
- మరమ్మతులపై దృష్టి పెట్టని అధికారులు

బీచ్ రోడ్డు: విశాఖ సాగరతీరం వెంబడి ఉన్న పార్కుల్లోని చిన్నారుల ఆట పరికరాలు పాడై మూలకు చేరాయి. వాటికి మరమ్మతులు చేపట్టే నాథుడు కరువయ్యారు. ఫలితంగా నిత్యం చిన్నారుల ఆటపాటలతో కళకళలాడే పార్కులు బోసిపోయి దర్శనమిస్తున్నాయి. సందర్శకులను ఆకట్టుకునేలా తీరం వెంబడి పార్కులను జీవీఎంసీ అభివద్ధి చేసింది. ముఖ్యంగా చిన్నారుల ఆడుకునేందుకు కోస్టల్ బాటరీ నుంచి వైఎంసీఏ వరకు పలు పార్కులను ఆట పరికరాలతో తీర్చిదిద్దింది. తీరానికి వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పార్కుల్లో ఆటలాడిస్తూ సముద్రాన్ని చూస్తూ సేదతీరేవారు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పార్కుల్లో ఉన్న ఆట పరికరాలు పూర్తిగా శిథిలమైపోయాయి. దీంతో సందర్శకులు నేరుగా తీరంలో కాసేపు సేదతీరి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఆడుకునే అవకాశం లేకపోవడంతో చిన్నారులు నిరాశకు గురవుతున్నారు.

మరమ్మతులు అవసరం

కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు గోకుల్ పార్క్, చిల్డ్రన్ పార్క్, ఎబిలిటీ పార్క్‌లను జీవీఎంసీ అభివృద్ధి చేసింది. గోకుల్ పార్కులోని ఆట పరికరాలు పూర్తిగా పాడైపోయాయి. చిల్డ్రన్ పార్కు చాలా అధ్వానంగా తయారైంది. వైఎంసీఏ ఎదురుగా ఉన్న ఎబిలిటి పార్క్‌లో చిన్నారులకు ఇష్టమైన ఆట పరికరాలు చాలా తక్కువగా ఉన్నాయి. తీరం వెంబడి ఉన్న పార్కుల్లోని ఆట పరికరాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి చిన్నారులకు ఆహ్లాదం అందించాలని నగరవాసులు, సందర్శకులు కోరుతున్నారు.



చిల్డ్రన్ పార్క్‌లో అధ్వానంగా జారుడు బల్ల



పిల్లల పార్క్‌లో తెగిన ఊయల

సబ్సిడీ టమాటా విక్రయాల పరిశీలన

ఆరిలోవ: ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా అందుబాటులోకి వచ్చింది. దీని కోసం ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారులు సబ్సిడీపై కిలో టమాటా రూ.50 అందించడానికి చర్యలు చేపట్టారు. మంగళవారం 67 క్వింటాళ్లు, బుధవారం 16 క్వింటాళ్ల టమోటా విక్రయించారు. మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కిరణ్, పాడేరు వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి రాకేష్ సబ్సిడీ టమోటా కౌంటర్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులు ఆధార్, రేషన్ కార్డుల్లో ఏదో ఒకటి చూపించి సబ్సిడీ టమాటా కొనుగోలు చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరికీ 2 కిలోల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎంవీపీ రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, టీడీపీ నాయకుడు పట్టాభి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంవీపీ రైతుబజార్‌లో అధికారుల సమక్షంలో సబ్సిడీ టమాటా విక్రయిస్తున్న రైతులు

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు



పీతలవానిపాలెంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మద్దిలపాలెం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బుధవారం పీతలవానిపాలెంలో సామూహిక కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో 300 మందికి పైగా మహిళలు పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



ఏపీఎస్‌ఈబీ కాలనీలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఏపీఎస్‌ఈబీ కాలనీలో..

జీవీఎంసీ 15వ వార్డులోని ఏపీఎస్‌ఈబీ కాలనీలో వేద విశ్వనాథశర్మ పండితులు ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా మహిళలు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందించారు.

చదువుల తల్లీ.. పాలయమాం



సరస్వతీదేవిగా విజయదుర్గాదేవి



చినవాల్తేరులో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జీవీఎంసీ 9వ వార్డు విజయదుర్గా కాలనీలో కొలువైన విజయదుర్గాదేవిని ఆలయ అర్చకులు బుధవారం సరస్వతీ దేవిగా అలంకరించారు. స్థానిక విద్యార్థులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. 12వ వార్డు పెదగదిలి దరి అంబేడ్కర్ కాలనీలోని దుర్గాదేవి మండపంలో పలువురు భక్తులు భవానీ మాల ధరించారు. 11వ వార్డు పాత ఆరిలోవలో దుర్గాలమ్మ గుడి, 13వ వార్డు దుర్గాబజార్ వద్ద దుర్గాదేవి ఆలయంలో భక్తులు అమ్మవారికి నిత్యం ప్రత్యేక పూజలు జరుపుతున్నారు.

వాడవాడలా వైభవంగా వేడుకలు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేరు అమ్మవారి వీధి యూత్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజ, దీపారాధన, మధ్యాహ్నం మహా అన్నసమారాధన నిర్వహించారు. వేల మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

- బలరాంనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి సన్నిధిలో కళాకారిణులు చేసిన భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వారిని అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అమ్మవారి సారె ఊరేగింపు, కుంకుమ పూజ, దీపారాధన కార్యక్రమాల్లో స్థానిక మహిళలు, అసోసియేషన్ ప్రతినిధులు బండారి దేముడు, గణేష్, మోహన్, సత్తిబాబు, ఒమ్మి అప్పారావు, శ్రీను, సాయి బలరాం తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా దుర్గాదేవి

ఎంవీపీ కాలనీ సెక్టార్-8లోని శ్రీసత్యసాయి ప్రేమ సదన్‌లో దుర్గాదేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చదువుల తల్లికి చిన్నారుల పూజలు

మద్దిలపాలెం: పీతలవానిపాలెంలో శ్రీకృష్ణా యువజన సంఘం ఆధ్వర్యంలో చిన్నారులచే సరస్వతీ పూజ నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొని పూజలు చేశారు. పలువురు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. చిన్నారులకు ఆర్కే సప్లయర్స్ పీతల రామకృష్ణ, సత్య దంపతులు పుస్తకాలు, పెన్సిళ్లు, సరస్వతీ యంత్రాలు, వాటర్ బాటిళ్లు, ఫలహారం అందజేశారు. వారిని శ్రీకృష్ణా యుజవన సంఘం సభ్యులు అభినందించారు.



భజన కళాకారులను సత్కరిస్తున్న బలరాంనగర్ యూత్ సభ్యులు



పెదగదిలిలో అమ్మవారి సమక్షంలో భవానీ మాల ధరించిన భక్తులు



పీతలవానిపాలెంలో సరస్వతీ పూజ చేస్తున్న చిన్నారులు

నేడు అన్నదానం

పీతలవానిపాలెంలోని మండపం వద్ద గురువారం అన్నదానం నిర్వహిస్తున్నామని శ్రీకృష్ణా యువజన సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్ని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

- హెచ్‌బీ కాలనీ శివాలయం సముదాయంలో కొలువైన సరస్వతీదేవి ఆలయంలో స్థానిక చిన్నారులు సరస్వతీ పూజ, అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

ఘనంగా అన్నదానాలు



కేఆర్ఎం కాలనీలో అన్నదానం చేస్తున్న మొల్లి అప్పారావు



మంగాపురం కాలనీలో అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్

మద్దిలపాలెం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో నవదుర్గా గణేష్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నసమారాధనలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ మొల్లి అప్పారావు పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో..

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఉత్సవ కమిటీ సభ్యులు సన్నీ, సురేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పప్పన్నమూ కష్టమే

- రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే సరఫరా
- కందిపప్పు, పంచదార ఊసే లేదు
- బయటి మార్కెట్‌లో ధరలకు రెక్కలు
- పేద, మధ్యతరగతి ప్రజలకు అవస్థలు



రేషన్ వాహనం వద్ద సరకుల కోసం నిరీక్షిస్తున్న కార్డుదారులు

సీతమ్మధార : పేద, మధ్య తరగతి ప్రజలకు పండగ పూట పప్పన్నమూ కష్టమే అన్నట్లుగా ఉంది పరిస్థితి. బయటి మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను అంటాయి. ఉప్పు నుంచి పప్పు వరకు ధరలు భారీగా పెరిగిపోయాయి. ధరలను అదుపు చేస్తామని, నిత్యావసర సరకులను రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తామని ప్రకటనలు గుప్పించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో విఫలం కావడంతో ప్రజలపై భారం పెరిగిపోయింది. పరిస్థితి ఇలా ఉంటే ఏం కొంటాం.. ఏం తింటామంటూ వారంతా నిట్టూరుస్తున్నారు.

రేషన్ దుకాణాలను పటిష్టం చేస్తామని..

ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రేషన్ దుకాణాలను పటిష్టం చేస్తామని ప్రకటించారు. ఉప్పు నుంచి పప్పు వరకు తక్కువ ధరకే నిత్యావసర సరకులు అందిస్తామని హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఆ దిశగా చర్యలు మాత్రం కానరావడం లేదు. రేషన్ దుకాణాల్లో ఏ సరకూ సక్రమంగా ఇస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. అధికారంలోకి వస్తే తొలుత కందిపప్పును రాయితీపై అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. దశల వారీగా పామాయిల్, గోధుమపిండి తదితర సరకులు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు వంట నూనె, గోధుమ పిండి పంపిణీని పక్కన పెడితే కందిపప్పును అరకొరగా అందిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు పెరిగినప్పుడు పేదలకు సాంత్వన చేకూర్చేందుకు రైతు బజార్లు, రేషన్ డిపోలలో రాయితీపై వంటనూనె, కందిపప్పు, శనగపప్పు పంపిణీ చేసేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు పెరిగినపుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో కంది పప్పును రూ.67కే అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఇటువంటి చర్య లు కనిపించడం లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు.

మూడు నెలలుగా ఇదే దుస్థితి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగస్టు, సెప్టెంబర్‌లో కార్డుదారులకు పంచదార ఇవ్వనేలేదు. ఈ నెల అరకొరగా కందిపప్పు ఇస్తున్నారు. గత నెలలో వినాయక చవితి పండగ ఉందని తెలిసి కూడా పౌరసరఫరాల శాఖ పూర్తిస్థాయిలో పంచదార ఇవ్వకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మూడో నెల కూడా రేషన్ డిపోల ద్వారా కందిపప్పు పూర్తి స్థాయిలో ఇవ్వకపోవడం గమనార్హం. పౌర సరఫరాల శాఖ సర్కిల్ – 2 పరిధిలో గల తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లో 152 రేషన్ డిపోలున్నాయి. కానీ 12.7 టన్నుల కందిపప్పు మాత్రమే రావడంతో కార్డుదారులకు కష్టాలు తీరడం లేదు. ఈ డిపోల పరిధిలో గల 1.53 లక్షల మంది కార్డుదారులకు 78 వాహనాల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నారు. అయితే ఒక్కో డిపోకు 100 కిలోల కందిపప్పు మాత్రమే ఇవ్వడంతో అది కొద్దిసేపటిలోనే అయిపోతోంది. ప్రతీ నెలా కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యంతో సరిపెట్టేస్తున్నారు. గత నెల సర్కిల్ – 2 పరిధిలో రైస్‌కార్డుదారులకు 200 కిలోల పంచదార మాత్రమే ఇవ్వడంతో పలు డిపోలకు అసలు అందనేలేదు. కందిపప్పు కిలో బహిరంగ మార్కెట్‌లో రూ.190 వుండగా, సూపర్‌బజార్‌లో రూ.185కి, రైతుబజార్లలో రూ.150కి విక్రయిస్తున్నారు. రేషన్ డిపోలో రూ.67కే ఇవ్వడంతో డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ నెలలో దసరాతోపాటు దీపావళి పండగలున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో సంక్రాంతి కానుకల సరఫరా లేనట్టేనని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు.



సరకులు అందడం లేదు

కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ సరకులు పూర్తి స్థాయిలో అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో డిపోల ద్వారా బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార ఇచ్చేవారు. గత నెల పంచదార ఇవ్వనేలేదు. ఈ నెలలో కొన్ని డిపోలకు మాత్రమే పంచదార వచ్చిందని చెబుతున్నారు. వినాయక చవితి సమయంలోనూ పంచదార ఇవ్వకపోవడం దారుణం.

– డి.లలిత, సీతమ్మధార

బియ్యంతో సరిపెట్టేస్తున్నారు

కృష్ణాష్టమి వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నా రేషన్ డిపోల్లో పంచదార పంపిణీ చేయడం లేదు. ఏ డిపోలోనూ పూర్తి స్థాయిలో కార్డుదారులకు పంచదార ఇవ్వలేదు. ఇచ్చేదే అర కిలో పంచదార. అదికూడా పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం విడ్డూరంగా వుంది. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యంతోనే సరిపెట్టేస్తున్నారు.

– బి.రాధ రెడ్డి, గురుద్వార

కందిపప్పు ఇవ్వకపోవడం దారుణం

ఈ నెలలో దసరాతోపాటు దీపావళి పండగ ఉంది. ఒకే నెలలో రెండు పండగలున్నా కార్డుదారులకు కందిపప్పు ఇవ్వకపోవడం దారుణం. ఇప్పటికే రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. ఇప్పుడేమో ఒక్కో డిపోకి కేవలం వంద కిలోలు మాత్రమే ఇవ్వడంతో అది ఒక్క పూటలోనే అయిపోయిందని డీలర్లు అంటున్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ డిపోలను నిర్వీర్యం చేస్తోంది.

– అన్నపూర్ణ, రేసపువానిపాలెం

'సాల్వ్ ఫర్ టుమారో' పోటీలకు విశేష స్పందన

బీచ్‌రోడ్డు: జాతీయ విద్య, ఆవిష్కరణలు వెలికి తీసేందుకు నిర్వహించిన సాల్వ్ ఫర్ టుమారో–2024 పోటీలకు విశేష స్పందన లభించిందని సామ్‌సంగ్ ప్రతినిధి జె.బి.పార్క్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా పలు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు వేల సంఖ్యలో ఉత్సాహవంతులు పాల్గొన్నారన్నారు. అసోంలోని గోలాఘాట్‌కు చెందిన ఎకో టెక్ ఇన్నోవేటర్ స్కూలల్ బృందం 'కాలుష్య రహిత తాగునీటికి సమానమైన అవకాశాల అభివృద్ధి' అనే ప్రాజెక్ట్ కమ్యూనిటీ చాంపియన్‌గా నిలిచిందని చెప్పారు. భూగర్భ జలాల నుంచి ఆర్సెనిక్‌ను తొలగించే సాంకేతికతను అభివృద్ధి చేసిన కర్ణాటకలోని ఉడిపికి చెందిన మెటల్ యూత్ బృందం ఎన్విరాన్‌మెంట్ చాంపియన్‌గా నిలిచినట్లు తెలిపారు. విజేతలకు రూ.75 లక్షల సీడ్ గ్రాంట్‌ను అందించినట్లు జె.బి.పార్క్ వెల్లడించారు.

'డైలాగ్ అండ్ డెమోక్రసీ' పుస్తకావిష్కరణ

సీతంపేట : సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ అధ్యక్షుడు ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ రచించిన డైలాగ్ అండ్ డెమోక్రసీ 5వ సంపుటి ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఫోరం ఫర్ బెటర్ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎ.ఎస్.శర్మ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెమోక్రసీ అనేది అమెరికన్ కానిస్టిట్యూషన్ నుంచి తీసుకున్నామని, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పలు దేశాల రాజ్యాంగాల నుంచి అనేక విషయాలు సంగ్రహించి ముసాయిదా తయారు చేశారన్నారు. దేశంలో అందరికీ సమాన హక్కులు కల్పించేలా రాజ్యాంగం రూపొందించారని గుర్తు చేశారు. యువతరం ప్రశ్నించే తత్వం అలవాటు చేసకోవాలన్నారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయం సొసైటీ కార్యదర్శి డీఎస్.వర్మ, సాహితీవేత్తలు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఈఏఎస్ శర్మ తదితరులు

3.2 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శివనారాయణ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మధురై జిల్లాకు చెందిన పుకాజహేంతి కాలిముత్తు విశాఖ మీదుగా చెన్నైకు అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని నుంచి 3.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, గవర్నమెంట్ రైల్వే పోలీస్‌లకు అప్పగించారు.